చలనం జీవానికి సూచన. చురుకుదనం ఆరోగ్యపు లక్షణం. పోటీతత్వం ఉనికిని నిరూపించుకునే ప్రయత్నం. దారుఢ్యం సమర్థతను చాటే యత్నం. వీటన్నిటినీ కలగలిపేదే క్రీడ. అందుకే ప్రతి నాగరికతలోనూ క్రీడలు అభిన్నంగా ఉన్నాయి. వాటికోసం పోటీలు పెట్టడమూ, కొత్త కొత్త క్రీడలను కనుగొనడం అన్ని సంస్కృతుల్లోనూ కనిపిస్తుంది. ఒక గోదా... అందులో ఇద్దరు మనుషులు ఉంటే చాలు... పోటీ రసవత్తరంగా సాగిపోతుంది. అడుగుల్ని పరుగుపందెంగా మార్చుకుంటే చాలు... క్రీడా సంబరం మొదలైపోతుంది. అందుకే ప్రపంచమంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే కార్యక్రమంగా ఒలింపిక్స్‌ను గుర్తిస్తారు. ఆ క్షణాలు వచ్చేస్తున్నాయి. జూలై 26 నుంచి ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్‌లో ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. నిజానికి ఒలింపిక్స్‌లో మన ప్రయాణం ఏమంత గొప్పగా కనిపించదు. 1984 నుంచి 1992 వరకు ఒక్క పతకం కూడా గెలుచుకోని పరిస్థితి. అలాగని కొన్ని మెరుపులు లేకపోలేదు. మౌలిక వసతుల లేమి, ఆర్థిక అసమానతలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం లాంటి ఎన్నో సవాళ్లను దాటి నిలిచి గెలిచిన క్షణాలున్నాయి. ఒలింపిక్స్‌తో 124 ఏళ్ల ప్రయాణం మనది.

కవర్ స్టోరీ

... కె.ఎల్. సూర్య




# పారిస్‌లో పాగా వేద్దాం



గ్రీకులు సౌందర్య ఆరాధకులు. సౌందర్యం అంటే వాళ్ల దృష్టిలో అంగసౌష్టవం మాత్రమే కాదు. దేహదారుఢ్యం కూడా. కేవలం యుద్ధంలోనే వీరత్వం చూసే తత్వం కాదు, క్రీడల్లోనూ దాన్ని చాటాలనుకునే తపన వారిది. అందుకే తమ దేవతలను కొలిచేందుకు చేసే వేడుకలలో క్రీడలకు కూడా ముఖ్యమైన స్థానం ఉండేది. అలా ఓ నాలుగు ముఖ్యమైన క్రీడల పోటీలను నిర్వహించేవారు. వాటిలో ఒకటే ఒలింపిక్స్! జ్యూస్ అనే దేవతను ప్రసన్నం చేసుకునేందుకు ఒలింపియా అనే ప్రాంతంలో మొదలుపెట్టిన పోటీలివి. జ్యూస్ కుమారుడైన హెర్క్యులస్, స్వయంగా ఈ పోటీలను ప్రారంభించాడని నమ్మకం. ఒలింపియా అన్న మాటే కాదు, ఈ రోజు మనం ఉపయోగిస్తున్న మరికొన్ని పదాలు... ఈ తొలి క్రీడల నుంచే వచ్చాయి. నాలుగేళ్లకు ఓసారి జరిగే ఈ పోటీలను ఒలింపియాడ్ అని పిలిచేవారు. అదే ఇప్పటి ప్రతిభా పరీక్షలకు కూడా ఉపయోగిస్తున్నారు. క్రీస్తు పూర్వం 776లో మొదలైన ఈ పోటీల్లో మొదట స్టేడ్ అనే ఒక పరుగుపందాన్ని మాత్రమే నిర్వహించేవారు. స్టేడ్ అంటే సుమారు 182 మీటర్ల దూరాన్ని పూర్తిచేయడం. ఈ పోటీని నిర్వహించే ప్రదేశానికి స్టేడియన్ అని పేరు. అదే క్రమంగా మన జీవితాల్లో భాగమైన స్టేడియం పదానికి దారితీసింది.

## ఆరంభమే సంచలనం!

కొరైబొస్ అనే ఆటగాడు తొలి ఒలింపిక్ పోటీని గెలుచుకున్న వీరుడిగా గుర్తుండిపోతాడు. తనేమీ పరుగుపందాలలో ఆరితేరినవాడు కాదు. ఒక వంటవాడు మాత్రమే. ఇంతాచేసి అతనికేమీ బంగారు పతకాలు ఇవ్వలేదు. ఆలివ్ ఆకులతో చేసిన కిరీటం మాత్రమే